భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

దండుగడ్డ ఏరియాలో అధికారులతో కలిసి భూములను పరిశీలిస్తున్న కలెక్టర్

కొత్తకోట, జనవరి 19 : వ్యవసాయ యోగ్యమైన భూమి కలిగిన రైతులకే రైతు భరోసా లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని, వ్యవసాయ యోగ్యంకాని భూములను గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం, అర్హుల ఎంపిక కోసం జరుగుతున్న సర్వే విషయమై ఆదివారం కొత్తకోట మున్సిపాలిటీ కార్యాలయంలో కలెక్టర్ మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం కొత్తకోట మున్సిపాలిటీ పరిధిలోని దండుగడ్డ ప్రాంతంలో వ్యవసాయ యోగ్యం కాని భూములను, ఇప్పటికే లే అవుట్లుగా మారిన భూములను తాసీల్దార్, మున్సిపల్ కమిషనర్, వ్యవసాయ అధికారులతో కలిసి క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన, నిజమైన రైతులకు రైతు భరోసా లబ్ధి చేకూరుతుందన్నారు. లే అవుట్లు, ఇళ్లు నిర్మించుకున్న భూములు, భూసేకరణ చేసిన భూములను గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి జెడ్పీ డిప్యూటీ సీఈవో రామమహేశ్వర్, తాసీల్దార్ వెంకటేశ్, ఎంపీడీవో చెన్నమ్మ, మున్సిపల్ కమిషనర్, వ్యవసాయ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సర్వే త్వరగా పూర్తి చేయాలి

శ్రీరంగాపురంలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

పెబ్బేరు, జనవరి 19 : సంక్షేమ పథకాల అమలు కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేను సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఆదివారం పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల్లో పర్యటించిన ఆయన అధికారులు నిర్వహిస్తున్న సర్వేను తనిఖీ చేశారు. ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభించనున్న ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డుల జారీకి సంబంధించిన ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సర్వే మొత్తం 20వ తేదీలోగా పూర్తి చేయాలని, 21 నుంచి నిర్వహించనున్న గ్రామ సభలపై గ్రామాల్లో చాటింపు వేయించి ముందస్తు ప్రచారం చేయించాలని ఆయన తెలిపారు. సర్వే అనుసరించాల్సిన విధానాలను, నిబంధనలను ఆయన వివరించారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- గ్రామ సభల్లో దరఖాస్తుల స్వీకరణ
- కలెక్టర్లతో మంత్రులు పొంగులేటి, తుమ్మల, ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్

మంత్రుల వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, అధికారులు

వనపర్తిటౌన్, జనవరి 19 : అర్హులైన ప్రతిఒక్కరికీ రేషన్‌కార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసిందని, రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతర ప్రక్రియ అని చివరి లబ్ధిదారుల వరకు అందిస్తామని మంత్రులు పొంగులేటి శ్రీనివాసులు, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల, గ్రామ సభల నిర్వహణపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి కలెక్టర్లతో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26వ తేదీ నుంచి ప్రతిష్ఠాత్మకంగా నాలుగు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టబోతుందని, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామసభల్లో దరఖాస్తులను స్వీకరించాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా కూడా కొత్త రేషన్‌కార్డులకు లేదా సభ్యుల చేర్పులకు దరఖాస్తులు కూడా ఇప్పటికే, గతంలో జరిగిన ప్రజా పాలన సదస్సులలో స్వీకరించిన దరఖాస్తుల జాబితాలో అర్హులైన వారిని గుర్తించే ప్రక్రియ పురోగతిలో ఉందని అన్నారు. ఈనెల 26న ప్రారంభించే నాలుగు పథకాలపై 21వ తేదీ నుంచి ప్రారంభమయ్యే గ్రామసభల్లో ప్రజా అభిప్రాయాలు, ఫీడ్ పాలన సేవా కేంద్రాల్లో కొత్తగా తీసుకున్న దరఖాస్తులు, ఎంపీడీవో కార్యాలయంలో ఇప్పటికే ఉన్న దరఖాస్తులను తగు రీతిలో పరిశీలించిన తర్వాత అర్హులైన లబ్ధిదారుల తుది జాబితాను ప్రకటించమన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఇంటి స్థలం ఉన్న వారి జాబితా ఇంటి స్థలం లేని వారి రెండు జాబితాలను గ్రామ సభల్లో ప్రదర్శించాలని, అలాగే కొత్తగా గ్రామ సభల్లో వచ్చే దరఖాస్తులను కూడా పరిశీలించాలని సూచించారు. రేషన్‌కార్డుల మంజూరికి గానూ దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతి భూమికి రైతు భరోసా ఇస్తామని వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా రైతు భరోసా లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కనీసం 20రోజుల పాటు కూలీ పనికి వెళ్లిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపజేయాలన్నారు. ఇటీవల రాష్ట్రంలో 156 గ్రామాలను మున్సిపాలిటీల్లో కలపడం జరిగిందన్నారు. ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతోపాటు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

గ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని సీఎస్ శాంతి కుమారి కలెక్టర్లను ఆదేశించారు. 21 నుంచి గ్రామ సభలను చేపట్టాలన్నారు. గ్రామ సభలకు హాజరయ్యే ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అదర్శ్ సురభి, అదనపు కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

అర్హులకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు

గద్వాల, జనవరి 19 : జిల్లాలో అర్హులైనా ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా అందిస్తామని కలెక్టర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆదివారం జారీ చేసిన ప్రకటనలో కలెక్టర్ మాట్లాడుతూ నూతన రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాలపై ప్రజలు ఆందోళన చెందకుండా ఉండేందుకు ఈ ప్రకటన విడుదల చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జాబితాలో పేర్లు లేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపాల్టీల్లో, కలెక్టర్ కార్యాలయాల్లో నిరంతరంగా ప్రజాపాలన కేంద్రాలు నిర్వహించి దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు జరిగే గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పథకాలు అమలు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

సాగు యోగ్యం కాని భూములు గుర్తింపు

గద్వాల, జనవరి 19 : అర్హులైనా వారికి రైతు భరోసా అందించడంలో భాగంగా ఆదివారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి సక్రియానాయక్, సహాయ వ్యవసాయ సంచాలకురాలు సంగీతలక్ష్మీతో కలిసి గద్వాల శివారు ప్రాంతంలో సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించారు. ఇందులో భాగంగా స్థానిక మండల రెవెన్యూ అధికారి శివకుమార్‌తో కలిసి గద్వాల పట్టణ శివారులో వెలసిన వెంచర్లు, స్కూల్ భవనాలు, కోళ్లషెడ్స్, చేపల చెరువులు తదితర వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రైతు భరోసా పోర్టల్‌లో వాటిని నమోదు చేసినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటన చేసిన సమయంలో సాగుకు అనువైనా భూములను గుర్తించడంతో పాటు నిజమైనా రైతులకు నష్టం కలగకుండా చూస్తున్నట్లు చెప్పారు. ఆ వెంట వ్యవసాయ విస్తరణ అధికారి ఉషశ్రీ ఉన్నారు.

కాంగ్రెస్ గ్యారెంటీలపై గల్లపడతాం

- బాకీపడ్డ రైతు భరోసా రూ.15వేలు, రూ.2లక్షల రుణమాఫీ ఇచ్చే వరకు వదలిపెట్టం
- సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పరాభవం తప్పదు
- బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య

సమావేశంలో మాట్లాడుతున్న కుర్వ పల్లయ్య

అయిజ, జనవరి 19 : అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన వాగ్దానాలైన ఆరు గ్యారెంటీలను అమలు చేసే వరకు గల్లపట్టి అడుగుతామని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకిచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తున్నామని ఢిల్లీలో రేవంత్‌రెడ్డి చెప్పడం పెద్ద జోకన్నారు. తెలంగాణను ఉద్ధరించని రేవంత్‌రెడ్డి ఢిల్లీని ఉద్ధరిస్తాడా అని ఎద్దేవా చేశారు. రూ.2లక్షల రుణమాఫీ చేయకుండా, రైతు భరోసా ఇవ్వకుండా, ఆడబిడ్డలకు మహాలక్ష్మి పథకం కింద రూ.2,500 చొప్పున ఖాతాలో జమ చేయకుండా రూ.4వేల పింఛన్ పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసం కాంగ్రెస్ నాయకులను గల్లపట్టుకొని నిలదీస్తామన్నారు. ఆదివారం అయిజ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీని అమలు చేయక సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి అక్కడ గ్యారెంటీలు అమలు చేసే బాధ్యత కచ్చితంగా తనదే అని అబద్ధాలు చెప్పడం చూస్తుంటే ఢిల్లీ ఓటర్లు కాంగ్రెస్ పాతాళానికి తొక్కడం గ్యారెంటీ అని పేర్కొన్నారు. తల్లికి అన్నం పెట్టనోడు పిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తానని చెప్పిన చందంగా రేవంత్‌రెడ్డి వైఖరి ఉందని విమర్శించారు. కూట్లో రాయిని తీయనోడు.. ఏట్లో రాయిని తీస్తానని చెప్తే తెలంగాణ ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కేసీఆర్ హయాంలో నాట్లప్పుడు రైతుబంధు పైసలు బ్యాంకులో జమ అయితే కాంగ్రెస్ పాలనలో ఓట్లప్పుడు మాత్రమే వేయడం రైతులను మోసగించడమేనన్నారు. అధికారంలోకి వస్తే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, రైతు భరోసా రూ.15వేలు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు నిస్సిగ్గుగా మాట మార్చి మార్చడం రేవంత్ వక్రబుద్ధి బయటపడిందన్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు మెడలు వంచుతామని, ఎక్కడిక్కడ ప్రజలు, ఓటర్లు గల్ల పట్టి అడిగే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు మూల వీరేశ్, పట్టణ మాజీ అధ్యక్షుడు కుర్వ వీరేశ్, మాధవ్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

21నుంచి గ్రామసభలు

వడ్డేపల్లి, జనవరి 19 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు అర్హులను గుర్తించేందుకు గ్రామసభలను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరిస్తామని ఎంపీడీవో రామకృష్ణ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీన వెంకట్రామనగర్, జక్కిరెడ్డిపల్లె, జిల్లెడదిన్నె, 22వ తేదీన తిమ్మాజిపల్లి, కోయిలదిన్నె, జూలేకల్, 23వ తేదీన రామాపురం, 24వ తేదీ కొంకల, తనగల గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామసభలు నిర్వహిస్తామని అన్నారు.

25న మున్సిపల్ పాలకవర్గానికి సన్మానం

అయిజ, జనవరి 19 : ఈ నెల 25న అయిజ మున్సిపల్ పాలకవర్గానికి పౌరసన్మానం చేయనున్నట్లు అయిజ అఖిలపక్ష కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని అఖిలపక్ష కమిటీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఐదేండ్లు అయిజ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేసిన చైర్మన్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్లను సన్మానించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వచ్చే పాలకవర్గం అయిజ అభివృద్ధికి కృషి చేసేలా సలహాలు ఇద్దామని పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఆవరణలో పాలకవర్గానికి సన్మానం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో అఖిలపక్ష కమిటీ నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయేతర భూములు గుర్తించాము

వడ్డేపల్లి, జనవరి 19 : మండలంలో వ్యవసాయేతర భూములను గుర్తించే ప్రకియను తాసీల్దార్ ప్రభాకర్ ఆధ్వర్యంలో చేపట్టారు. కొంకల 15 ఎకరాలు, బుడమొర్సులో 40, రామాపురం 30, జూలేకల్ 50, తనగల 25, వడ్డేపల్లి 30, పైపాడు 70, కోయిలదిన్నె 15 గర్తించామని ఆదివారం తాసీల్దార్ తెలిపారు. భూముల సర్వేలో డిప్యూటీ తాసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్రరావు, ఆర్ఐ ఆంజనేయులు, ఏఈవో విమల, రవీందర్, రామనాయుడు పాల్గొన్నారు.

మనోవైజ్ఞానికుడు వేమన

వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

గద్వాలటౌన్, జనవరి 19 : సమాజంలో రుగ్మతలను తూర్పారబట్టిన మనో వైజ్ఞానికుడు యోగి వేమనరెడ్డి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వెంకట రాజారెడ్డి కొనియాడారు. జిల్లా కేంద్రంలోని బీంనగర్‌లోని రెడ్డి సేవా సమితి బాలికల వసతి గృహంలో ఆదివారం యోగి వేమన శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి సమితి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరికీ అర్థమయ్యేలా పదాలతో కవిత్వాలు రచించిన వేమన అందరి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. వేమన ఆశయాలను, ఆలోచనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, కోశాధికారి వెంకటరెడ్డి, వార్డెన్ శ్రీలత, విద్యార్థినులు పాల్గొన్నారు.

టెండర్లకు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, జనవరి 19 : గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలకు సంబంధించిన మెటీరియల్ అందజేసేందుకు స్టేషనరీ షాపు యజమానుల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు పంచాయతీ రాజ్ శాఖ అధికారి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 16 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 4 గంటల వరకు వనపర్తి జిల్లా పంచాయతీరాజ్ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించబడతాయని పేర్కొన్నారు. షీల్డ్ కవర్ టెండర్లు దాఖలు చేయాలని, 22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే టెండర్లు వేసుకోవాలని, 23న ఉదయం 11 గంటలకు అదనపు కలెక్టర్ సమక్షంలో షీల్డ్ కవర్ టెండర్లను ఓపెన్ చేసి కేటాయిస్తామని, ఆసక్తి గల యజమానులు అన్ని పనిదినాల్లో జిల్లా పంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. సెక్యూరిటీ డిపాజిట్‌ను జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారి పేరుపై డీడీ తీసుకోవాలని, ఎస్‌బీఐ ఖాతా నెంబర్ 62496360273కు డీడీ చెల్లించాలని సూచించారు.

జెడ్పీ హైస్కూల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కార్యక్రమంలో పూర్వపు ఉపాధ్యాయులు, విద్యార్థుల

మల్దకల్, జనవరి 19 : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో 1975-76 బ్యాచ్ చెందిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠాలు బోధించిన అప్పటి గురువులను కృతజ్ఞతగ సన్మానించారు. అలాగే సైన్స్ ల్యాబ్ కోసం పూర్వ విద్యార్థులందరూ కలిసి రూ.1.50లక్షలు విరాళం అందించారు. కార్యక్రమంలో ఎంఈవో సురేశ్, పూర్వ ఉపాధ్యాయులు జానకిరాములు, ప్రభావతి, రామిరెడ్డి, కృష్ణారెడ్డి, సవరన్న, లక్ష్మన్న, పూర్వ విద్యార్థులు నాగరాజు, జనార్దన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, రాజగోపాల్, కాంతారెడ్డి, గిరిజకుమారి, సంధ్యారాణి, శ్రీహరి పాల్గొన్నారు.

టోల్‌గేట్ వద్ద నిలిచిన వాహనాలు

ఉండవల్లి మండలం పుల్లూరు టోల్‌గేట్ వద్ద నిలిచిన వాహనాలు

అలంపూర్ చౌరస్తా, జనవరి 19 : ఏపీలో సంక్రాతి సంబురాలు, సెలువులు ముగియడంతో ఆదివారం ప్రజలు తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో ఉండవల్లి మండలం పుల్లూరు గ్రామ సమీపంలో ఉన్న టోలోగేట్ వద్ద వాహనాలు భారీగా నిలిచిపోయాయి. తెలంగాణ నుంచి సంక్రాతి పండుగకు ఏపీ రాష్ట్రానికి వెళ్లిన ప్రజలు పిల్లలకు సెలువులు ముగియడంతో తిరిగి ఆదివారం హైదరాబాద్ వైపునకు ప్రయాణం అయ్యారు. దీంతో టోల్‌గేట్ వద్ద వాహనాలు బారులు తీరాయి. కిలో మీటర్ల దూరం వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. చిన్నపిల్లలు, వృద్ధులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

బీజేపీకి ప్రముఖ వ్యాపారవేత్త రాజీనామా

అమరచింత, జనవరి 19 : కొన్ని అనివార్య కారణాలతో తాను బీజేపీని విడుతున్నట్లుగా ప్రముఖ చీరాల వ్యాపారి మహంకాళి శ్రీనివాసులు వెల్లడించారు. ఆదివారం పట్టణంలోని బీసీ కాలనీలో తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థిగా పదో వార్డు నుంచి పోటీలో ఉన్న క్షేత్ర స్థాయిలో ప్రచారం చేయకపోయిన కేవలం 40ఓట్లతో ఓటమి పాలైన మహంకాళి శ్రీనివాసులు ఇద్దరు బీజేపీ సభ్యులను మున్సిపల్ కౌన్సిలర్లుగా గెలిపించుకోవడంతోపాటు మిగిలిన వారిని గెలుపు అంచుల వరకు పోటీలో నిలిచిన శ్రీనివాసులు బీజేపీకి దూరంగా ఉండి వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా భారీలో ఉంటానని వెల్లడించారు. పట్టణ అభివృద్ధికి పాటుపడే యువత తనకు మద్దతు ఇవ్వాలని ప్రముఖ జారి చీరల వ్యాపారి మహంకాళి శ్రీనివాసులు కోరారు.

నిరుద్యోగ యువతకు ఆర్థిక సాయం అందించాలి

అయిజ, జనవరి 19 : దళిత నిరుద్యోగ యువతకు అంబేద్కర్ అభయ హస్తం ద్వారా రూ.12 లక్షలు ఆర్థిక సాయం అందించాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం అయిజ పట్టణంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. 70శాతం దళితులకు భూమిలేదని, ప్రతి కుటుంబానికి మూడు ఎకరాల భూమి ఇవ్వాలని, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు దళితులకే ఖర్చు చేయాలని, ఎస్సీ కార్పొరేషన్‌కు ఏడాదికి రూ.10వేల కోట్లు కేటాయించాలని కోరారు. దళిత యువతకు అంబేద్కర్ బ్యాంక్ ఏర్పాటు చేసి, రూ.5కోట్లు గ్యారెంటీ లేని రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రవీణ్, రాజు, నాగరాజు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖిల్లాఘణపురం, జనవరి 19 : మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ కోండయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. టవర్ లైన్‌వర్క్ నిమిత్తం ఉదయం 8:30గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని, మండల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

రాజకీయాలు కాస్ట్‌లీగా మారాయి

- ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి

పుల్లూరు సమీపంలో ఉన్న లేపాక్షి రెస్టారెంట్ వద్ద ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి

అలంపూర్ చౌరస్తా, జనవరి 19 : నేడు రాజకీయాలు చాలా కాస్ట్‌లీగా మారాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ నుంచి ధర్మవరం వెళ్తున్న సందర్భంగా పుల్లూరు గ్రామ సమీపంలో లేపాక్షి రెస్టారెంట్‌లో కొంత సమయం సేదతీరారు. దీంతో ఆయన మాట్లాడుతూ ప్రతి రంగంలో గెలుపోటములు సహజమని అన్నింటినీ దిగమింగుతూ భవిష్యత్‌లో ముందుకెళ్లడమే మనిషి జీవితమని అన్నారు. కేతిరెడ్డిని చూసిన స్థానికులు, ప్రయాణికులు ఆయనతో సెల్ఫీలు దిగారు.

మల్దకల్‌లో కొనసాగుతున్న సర్వే

మల్దకల్, జనవరి 19 : మండలంలోని తాటికుంట, కుర్తిరావులచెర్యు, శేషంపల్లి గ్రామాల్లో వ్యవసాయాధికారులు సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు. రైతు భరోసా నిధుల మంజూరు విషయమై, సాగుకు యోగ్యం కాని భూములు, వెంచర్, ప్లాట్స్‌లను నాన్ అప్రూవల్ భూములుగా గుర్తించాలని సిబ్బందికి తెలిపారు. సర్వేను పకడ్బందీగా చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఈవో భాజా భాష, సర్వేయర్ శేఖర్ పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడి : కేసు నమోదు

ఎర్రవల్లి చౌరస్తా, జనవరి 19 : పేకాటస్థావరంపై దాడి చేసి ఐదుమందిపై కేసు నమోదు చేసిన ఘటన కోదండాపూర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై స్వాతి కథనం మేరకు ధర్మవరం గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం పేకాట ఆడుతున్న వెంకటేశ్వర్లు, సత్యారెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఈశ్వరయ్య, కృష్ణపై కేసు నమోదు చేసి వారి నుంచి రూ.1220, ఐదు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ప్రతిభకు పట్టాభిషేక ఆహ్వానం

నర్సింహాశర్మ

వనపర్తి టౌన్, జనవరి 19 : వనపర్తి జిల్లా సాహితీమూర్తి నాయకంటి నర్సింహాశర్మకు శ్రీశ్రీ కళావేదిక నిర్వహకుల నుంచి ఆహ్వానం అందింది. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న 143వ ప్రతిభకు పట్టాభిషేకం కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి సంస్కృతం ఆచార్యులు నాయకంటి నర్సింహాశర్మ ఆహ్వానం పొందారు. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయేట్రి అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు కీర్తి జాతీయ ప్రతిభ పురస్కారానికి ఆహ్వానం పంపారు. ఈనెల 21న మంగళవారం విజయవాడలో జరిగే కార్యక్రమానికి శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆహ్వానం పలికారని, ఈ ప్రతిభ అవార్డుకు ఆహ్వానించడం ఎంతో సంతోషంగా ఉందని నాయకంటి నర్సింహాశర్మ వెల్లడించారు.

పోస్టర్ విడుదల

ధరూరు, జనవరి 19 : సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఉప్పేరు నర్సింహ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో గ్రోమోర్ సెంటర్ వద్ద ఆదివారం కార్మిక నాయకులతో కలిసి ఆయన మహాసభల గోడ పత్రికను విడుదల చేశారు. ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు జరిగే మహా సభలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, మోష, తిమ్మప్ప, దేవదాసు, ప్రవీణ్, వినయ్, నర్సింహా, గోవిందు పాల్గొన్నారు.

అర్హులకే సంక్షేమ పథకాలు

గద్వాలఅర్బన్, జనవరి 19 : సర్వేల పేరిట కాలయాపన చేయకుండా నిజమైన అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. అదివారం జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లాలో నిరుపేదలకు ఇండ్లు, రేషన్‌కార్డుల మంజూరు విషయంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నిజమైన అర్హత కలిగిన పేదలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చిబాబు, రంగస్వామి, చిన్న రాముడు, నాగేశ్ ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

గోపాల్‌పేట, జనవరి 19 : మండల కేంద్రానికి చెందిన ఈర్ల సాయికుమార్(30) అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం మృతుడి కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. మండలాధ్యక్షుడు బొల్లెద్దుల బాలరాజు రూ.3వేలు, మహిళా కమిటీ మండల ఉపాధ్యక్షురాలు స్వప్న రూ.5వేల ఆర్థికసాయం మృతుడి కుటుంబానికి అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు భాస్కర్, మతీన్, కాశీనాథ